13 సత్యవాక్యం

13.0 భూమిక

మహాభారతం ప్రాచీన సంప్రదాయ కవిత్వానికి చెందిన రచన. ప్రాచీన సంప్రదాయ కవిత్వంలో ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం వంటి వివిధ ప్రక్రియలున్నాయి. తెలుగులో నన్నయ రాసిన భారతం 'ఇతిహాసం' అనే ప్రక్రియ కిందికి వస్తుంది. ఇతిహాసమంటే చారిత్రక సత్యమైన పూర్వరాజుల చరిత్ర. భారత రామాయణాలు తెలుగు సాహిత్యంలో ఇతిహాసాలు. 'భారతం' చంద్రవంశ రాజుల చరిత్ర ఐతే, దాని తర్వాత తెలుగులో వెలసిన 'రామాయణం' సూర్యవంశరాజుల చరిత్ర. భారత కథలో ధర్మరాజు నాయకుడు. అతనికి పూర్వం చంద్రవంశంలో పుట్టిన దుశ్యంతుడనే రాజు శకుంతలను వివాహమాడటం "శకుంతలోపాఖ్యానం" లోని ప్రధానమైన అంశం. ఈ ఇద్దరికి జన్మించిన 'భరతుడు' భారతదేశాన్ని మొత్తం పరిపాలించాడని, అతని పేరు మీదుగానే మనదేశానికి 'భారతదేశం' అని పేరు వచ్చిందని ప్రతీతి.

13.1 అభ్యసన ఫలితాలు

ఈ పాఠం చదివిన తర్వాత అభ్యాసకులు

- పద్య ప్రక్రియ విశిష్టతను గుర్తించగలుగుతారు
- సత్యం యొక్క గొప్పదనాన్ని వివరించగలుగుతారు.

13.2 కవి పరిచయం

ఈ పాఠ్యభాగం నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, చతుర్థాశ్వాసంలోనిది. నన్నయకు "ఆదికవి, వాగనుశాసనుడు" అని బిరుదులు ఉన్నాయి. ఈయన తెలుగు కవిత్వానికి ఆద్యుడు. క్రీ.శ. 11 వ శతాబ్దంలో వేంగి రాజైన రాజ రాజనరేంద్రుని ఆస్థానంలో పురోహితుడు. ఈయనకు భారతరచనలో సాయపడినవాడు నారాయణ భట్టు. ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణ గ్రంథం నన్నయ మరొక రచన అంటారు.

ఈ పాఠ్యభాగం నన్నయ రచించిన "శకుంతలోపాఖ్యానం" అనే భాగంలోనిది.

13.3 పద్యం అంటే

పద్యం అంటే అక్షర గణాలతో కూడుకున్న నాలుగు పాదాల కవిత్వ రచన. అక్షర గణాలంటే "య-మ-త-ర-జ-భ-న-స" అనే పేర్లతో ఉన్న గణాలు. వీటిలో గురు లఘువులనే మాత్రలుంటాయి. లఘువంటే ఒక్క క్షణం కాలంలో పలుకగలిగే అక్షరం అంటే హ్రస్వం. (అ - క- ల- వ- వంటివి). గురువంటే రెండుక్షణాల కాలంలో పలుకగలిగే అక్షరం. అంటే దీర్ఘం. (ఆ - కా- లా- వా- వంటివి). వీటితో కలిసి "య-మ-త" వంటి గణాలు ఏర్పడతాయి. ఉదాహరణకు - 'అలాగే' అనే మాట 'య' గణం. ఇందులో ఒక లఘువు, రెండు గురువులు ఉన్నాయి. లఘువును 'I' గురువును 'U' గుర్తులో సూచిస్తారు. 'అలాగే' అనే దానికి గుర్తులు - IUU అన్నమాట. ఇలా ఆలోచించే పద్ధతిని ఛందస్సు అంటారు. ఛందస్సులో రాస్తేనే అది పద్యం అనబడుతుంది. ఛందస్సులేని రచన పేరు 'వచనం' లేదా 'గద్యం'. వివిధ పద్యాలకు వేరు వేరుగా 'యతి' స్థానాలు ఉంటాయి. నాలుగు పాదాల్లోనూ ఒకే అక్షరం, ఒక అచ్చుతో కలిసి ఉండటాన్ని 'ప్రాస' నియమం అంటారు. ఈ పాఠంలోనే మీరు వ్యాకరణాంశాలు - ఛందస్సు అనే (14.3.2) విభాగంలో ఈ విషయాలు వివరంగా అధ్యయనం చేస్తారు.

పద్యం ప్రాచీనత

తెలుగు పద్యం మనకు నన్నయ ఆంధ్రభారతరచనకు ముందే శాసనాల్లోనూ రాగిరేకుల దాన పత్రాల్లోనూ కనిపిస్తున్నది. నన్నయ క్రీ.శ 11 వ శతాబ్దానికి చెందిన వాడయితే అంతకుముందు రెండువందల ఏండ్లకు ముందే శాసనాల్లో పద్యాలు ఉన్నాయని తెలుస్తున్నది.

పద్యాల్లో రకాలు

పద్యాల్లో వృత్తాలు, సీసాలు, కందాలు, ఆటవెలదులు, తేటగీతులు అనేవి ప్రధానమైన రకాలు. ఉత్పలమాల, చంపకమాల, మత్తేభం, శార్దూలం అనేవి ప్రసిద్ధమైన వృత్తాలు.

13.4 పాఠ నేపథ్యం

ఈ పాఠ్యం సత్యం చెప్పడం యొక్క గొప్పదనాన్ని వివరిస్తుంది. రాజైనా సరే! సత్యం పలుకకపోతే ఎదిరించడమే ధర్మం అనే గొప్ప జీవిత సత్యాన్ని బోధపరుస్తుంది. శకుంతలను కణ్వముని ఆశ్రమంలో గాంధర్వ వివాహం చేసుకున్న దుష్యంతుడు తన రాజ్యానికి తిరిగి వెళ్లిపోతాడు. శకుంతల గర్భవతియై 'భరతుడు' అనే పుత్రునికి జన్మనిస్తుంది. కొన్ని ఏండ్ల తర్వాత భరతుడు బాల్యంలో ఉండగా శకుంతలను తండ్రి ఐన కణ్వమహర్షి, ఆమె భర్త దుష్యంతుని వద్దకు పంపిస్తాడు. నిండు సభలో తనవద్దకు వచ్చిన శకుంతల ఎవరో తనకు తెలియదని అసత్యం పలుకుతాడు దుష్యంతుడు. అప్పుడు రాజైనా సరే, అబద్ధం చెప్పరాదని సత్యం యొక్క గొప్పతనాన్ని వివరిస్తుంది శకుంతల. ఇదీ ఈ పాఠ్యం సందర్భం. ఆ తర్వాత ఆకాశవాణి శకుంతల చెప్పింది సత్యమేనని సాక్ష్యం పలుకుతుంది. అది ఈ కథలో తర్వాత వచ్చే అంశం.

13.5 మూలపాఠం - 1

1.చ విమల యశోనిధీ పురుష వృత్తి మెరుంగుచు నుండు జూలెవే
దములను బంచభూతములను ధర్మావు సంధ్యలు నంతరాత్మయున్
యుముదును చంద్రసూరులునవహంబును రాత్రియు నన్మహాపదా
ర్థములివి యుండగా నరుడు దక్కొన నేర్చునే తన్ను ముచ్చిలన్,

2.సీ. ధర్మార్థ కామ సాధనకుపకరణంబు
గృహనీతి విద్యకు గృహమువిమల
చారిత్రశిక్షకాచార్యకం బన్వయ
స్థితికి మూలంబు సద్గతికి నూత
గౌరవంబున కేక కారణంబున్నత
స్థిరగుణమణులకాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ
చూవెభర్తకు నొండ్లగావు ప్రియము

ఆ. ఎట్టి ఘట్టములను నెట్టి యాపదలను
నెట్టి తీరములను ముట్టబడిన
వంతలెల్ల బాయునింతుల బ్రజలను
నొనరజూడ గనిన జనులకెందు

3.చ. నుతలజలపూరితంబు లగు నూతులు నూటిటికంటె సూనృత
వ్రత! యొకబావి మేలు మఱి బావులు నూటిటికంటె నొక్కస
త్క్రతువది మేలు తత్క్రతుశతంబునకంటే సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొకసూనృతవాక్యము మేలు సూడగన్.

ఒకటో పద్యం : ప్రతి పదార్థాలు

విమలయశోనిధీ	=	స్వచ్ఛమైన కీర్తికినిలయమైనవాడా!
		ఓ దుష్యంత మహారాజా!
వేదములను	=	నాలుగువేదములు, ఋక్, యజు, సామ, అదర్వణాలు

పంచభూతములు	=	భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము
ధర్మువు	=	ధర్మము
సంధ్యలు	=	ఉదయ, మధ్యాహ్న, సాయం సంధ్యలు
అంతరాత్మయున్	=	ఈ శరీరంలో ఉండే ఆత్మ
యముడును	=	యముడు
చంద్ర సూర్యులును	=	చంద్రుడును, సూర్యుడును.
అహంబును	=	పగటి భాగమును
రాత్రియున్	=	రాత్రి భాగమును
అను	=	అనబడే ఇరవై నాలుగును (ఇది మహాపదార్థములు)
పురుషవృత్తమును	=	పురుషుడు ప్రవర్తించే తీరుతెన్నులు
ఎఱంగుచు	=	తెలుసుకుంటూ
ఉండున్+ చూవె	=	ఉంటాయి సుమా!
నరుడు	=	మానవుడు
ఇవి	=	ఈ ఇరవై నాలుగు
ఉండగా	=	చూస్తూ ఉండగా(సాక్ష్యాలుగా)
నరుడు	=	మానవుడు
తన్ను బ్రుచ్చిలన్	=	తనను మోసగించడం
దక్కొన + నేర్చునె	=	స్వతంత్రించడం వీలుపడునా

తాత్పర్యం : ఓ కీర్తిమంతుడా! నాలుగు వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉదయ, మధ్యాహ్న సాయం సంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి, అను ఈ 24, పురుషులు ప్రవర్తించే తీరు తెన్నులను అనుక్షణం పరీక్షిస్తూ, పరిశీలిస్తూ ఉంటాయి. ఇవి చూస్తూండగా మానవుడు తనను తాను మోసగించడం సాధ్యపడుతుందా!

భావవిశేషము : మానవుడు అసత్యాన్ని పల్కుతూ తననెవరూ గమనించటంలేదని భావించడం సమాజంసంకాదు. ఎందుకంటే అంతరాత్మ, యమ, సూర్య, చంద్రులు, పగలు, రాత్రి మొదలైన మహాపదార్థాలు ఎల్లవేళ్లలా మనం చేసే పనులను పరిశీలిస్తూ ఉంటాయి. దాన్ని బట్టే మనకు ఫలితాలను కూడా ఇస్తూ ఉంటాయి. అందుచేత మానవులు ఇతరులను మోసం చేశానని, కన్ను కప్పానని అనుకోవటం పొరపాటే.

రెండో పద్యం : ప్రతి పదార్థాలు

ఉపకరణము	=	సాధనము, పనిముట్టు
అన్వయస్థితికి	=	వంశం నిలవడానికి
సద్గతి	=	మంచి లేదా ఉత్తమలోకాలు
ఆకరము	=	నిలయం
సంజనకంబు	=	మంచిగాపుట్టించేది
ఒండ్లు	=	ఇతరములు
వంతలు	=	కష్టాలు
పాయు	=	పోగొట్టు
ఇంతి	=	భార్య

తాత్పర్యం: ధర్మ, అర్థ, కామములను సాధించుటకు భార్య ఒక సాధనము. గృహనీతి అనే విద్యకు గృహిణిముఖ్యము. సచ్చరిత్రకు శిక్షణనిచ్చే ఆచార్యుని వంటిది. వంశం, నిలవటానికి, ఉన్నతలోకాలను పొందటానికి సహకారి, గౌరవం పొందటానికి కారణము, ఉన్నతమైన స్థిరమైన గుణములనే మణులకు నిలయము. ఎల్లవేళలా హృదయానికి సంతోషం కలిగించేది భార్య మాత్రమే. ఇతరములేవీభర్తకు ప్రియమును చేకూర్చలేవు. బాగా ఆలోచించిచూస్తే ఈ లోకంలో ఎటువంటి సందర్భాలలోనైనా ఎటువంటి ఆపదలు ఎదురైనా, ఎటువంటిస్థితికి చేరినా, కష్టాలనన్నీ పోగొట్టి భర్తను రక్షించేది భార్య మాత్రమే సుమా!

మూడో పద్యం : ప్రతి పదార్థాలు

చూడగన్	=	ఆలోచించిచూడగా
నూతజలపూరితంబు	=	మంచి నీటితో నిండినవైన
నూతులు	=	నూతులు
నూఱిటికంటె	=	నూఱు (తవ్వించడం) కంటె
సూనృతవ్రత	=	సత్యవ్రతుడా!
ఒక బావి	=	ఒక దిగుడు బావి లేదా వ్యవసాయాదులకుపయోగపడే పెద్ద నుయ్యి
మేలు	=	(త్రవ్వించడం) మంచిది
మఱి	=	ఇంకా
బావులు	=	విశాలమైననూతులు,
నూఱిటికంటెన్	=	నూఱు(త్రవ్వించడం) కంటె

ఒక్క	=	ఒక్క
సత్క్రతువు	=	దైవసంబంధమైన హోమం
అది	=	అది
మేలు	=	మంచిది.
తత్	=	ఆ (అటువంటి)
క్రతుశతంబునకంటె	=	నూఱు క్రతువుల కంటె,
సుతుండు	=	కుమారుడు
మేలు	=	మంచిది
తత్సుత	=	ఆ (అటువంటి)కుమారులు
శతకంబుకంటె	=	నూఱ్గురి కన్నా
ఒక	=	ఒక
సూనృతవాక్యము	=	సత్యవాక్యము
మేలు	=	మంచిది

తాత్పర్యం : ఆలోచించి చూస్తే మంచి నీటితో కూడిన నూతులు నూఱు త్రవ్వించడంకంటే ఒక దైవకార్యం చేయటం మంచిది. అటువంటి క్రతువులు నూరు చేయడం కన్నా ఒక మంచి కొడుకును కనడం మంచిది. అటువంటి నూఱుగురు కొడుకుల కంటె ఒక సత్యవాక్యము పలకడం మంచిది.

భావవిశేషం : విశేష అంశము : సత్యము యొక్క గొప్పదనం ఇంత అని చెప్పడానికి అలవికాదు గనక కవి దానిని ఉదాహరణ పూర్వకంగా తెలియజేస్తున్నాడు. ఈ లోకం అంతా సత్యం వల్లనే నడుస్తున్నది అన్నది చెప్పడమే కవి హృదయం. ప్రజలు లేదా జీవకోటి త్రాగే మంచి నీటి నూతులు నూఱిటి కంటే ఒక వ్యవసాయానికి నీరందించే బావి గొప్పది. అటువంటి వ్యవసాయపు బావులు నూఱు త్రవ్వించడం కంటే దైవ సంబంధమైన ఆరాధన, అర్చన, హోమాదులతో కూడిన ఒక క్రతువు గొప్పది. అట్లాంటి క్రతువులు నూఱు చేసేకున్నా ఒక మంచి కొడుకు ఉంటే మేలు. అటువంటిమంచి గుణ గణాలు కలిగిన కుమారులు నూఱుగురు ఉండే కంటే ఒక సత్యవాక్యము గొప్పది అనేది విశేష భావము.

పాఠగత ప్రశ్నలు - 1

ఈ కింది ప్రశ్నలకు నాలుగేసి సమాధానాలు ఉన్నాయి. వాటిలో సరైన సమాధానం సంకేతాన్ని ఎదురుగా ఉన్న కుండలిలో సూచించండి.

1. భార్యవలన సాధించబడే పురుషార్థాలు ( )
   (అ) ధన గుణ కీర్తులు (ఆ) ధర్మార్థకామములు
   (ఇ) సత్వరజస్తమములు (ఈ) భూ,భు,వ, సువలోకాలు

2. చారిత్రక శిక్షణకు ఆచార్యులెవరు ( )
   (అ) భార్య (ఆ) భర్త (ఇ) సుతుడు (ఈ) కుమార్తె

3. భార్య వలన పెరిగేది ఏది? ( )

(అ) సంపద (ఆ) ఇల్లు (ఇ) వంశం (ఈ) స్నేహం

4. అన్నిటా తోడు నీడగా భార్య ఎవరికి ఎక్కువ సహకరిస్తుంది ( )

(అ) స్నేహితులకు (ఆ) పొరుగువారికి (ఇ) భర్తకు (ఈ) పిల్లలకు

5. మంచి నీటి నిచ్చే నూతులు నూఱు త్రవ్వించటం కంటే ఏది మేలు ( )

అ. చెఱువు ఇ. బావి ఉ. బోరింగ్ ఋ. నది

6. వ్యవసాయబావులు నూఱు త్రవ్వించడం కంటే ఏది మేలు ( )

అ. నుయ్యి ఇ.గొయ్యి ఉ. ప్రతిజ్ఞ ఋ. క్రతువు

7. నూఱు క్రతువులుచేయడం కన్నా ఏది గొప్పది ( )

అ. సుతుడు ఇ. స్నేహితుడు ఉ. పురోహితుడు ఋ. జనహితుడు

8. మంచి కుమారులు నూఱ్గురిని కనడం కన్నా ఏది గొప్పది ( )

అ. అసత్యము ఇ. సత్యవాక్యము ఉ. పెద్దలవాక్యము ఋ. తెలివైనమాట

9. వేదములు ఎన్ని ( )

(అ) 1 (ఆ) 1 (ఇ) 4 (ఈ) 8

10. పంచభూతములనగా ( )

(అ) ఆయుష్యం, ఆరోగ్యం, భోగం, భాగ్యం, సంపద (ఆ) భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం

(ఇ) దేవుడు, దేవత, దెయ్యం,యముడు, మృత్యువు (ఈ) పాలు, పెరుగు, నెయి, తేనే, పంచదార

సమాధానాలు : 1 – ఇ, 2 – అ, 3 – ఉ 4.– ఉ.

5 – ఇ; 6 – ఋ; 7 – అ; 8 – ఇ.

9. – ఇ 10 – ఆ

13.6 మూల పాఠం - 2

4.క. వెలయంగ నశ్వమేధం

బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం

దుల నిడి తూపగ సత్యము

వలనన ములు సూపు గౌరవంబున పేర్మిన్.

5.తే. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుఁగావు
ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

6.క కావున సత్యము మిక్కిలి
గావిమల ప్రతిభ దలచి కణ్వాశ్రసం
భావిత సమయ స్థితిదయ
గావింపుముగొడుకుజూడకరుణాదృష్టిన్

నాలుగో పద్యం : ముఖ్య పదాలకు అర్థాలు

ఇరుగడలన్	=	రెండు ప్రక్కల
తూపగ	=	తూచగా,
గౌరవంబునన్	=	ఉన్నతముగా, ఎక్కువగా

తాత్పర్యం : ఒక త్రాసులో ఒక ప్రక్క వేయి అశ్వమేధ యూగముల పుణ్యఫలమును, వేరొక ప్రక్క సత్యవాక్యపుణ్య ఫలమును వేసితూచినచో సత్యవాక్యపుణ్యఫలమున్న వైపే ముల్లు బరువు చూపుతుంది.

భావము : వేయి అశ్వమేధ యాగములు చేస్తేవచ్చే పుణ్యఫలంకంటే ఒకే ఒక సత్యవాక్యం పలకడం వల్ల వచ్చే పుణ్యఫలం గొప్పది.

ఐదో పద్యం : ముఖ్య పదాలకు అర్థాలు

తీర్థాభిగమనంబు	=	పుణ్యక్షేత్రాల సందర్శనానికి వెళ్లటం
సర్వవేదసమధిగమము	=	వేదాలన్నిటి సారం గ్రహించుట
సరియు + కావు + అ	=	సరితూగ లేవు

తాత్పర్యం : పుణ్యక్షేత్రములన్నింటినీ సందర్శించినా, వేదాలన్నిటి సారము గ్రహించినా సరే అవి సత్యముతో సరి తూగలేవు. లోకంలో ఉన్న ధర్మాలన్నిటికన్నా సత్యవాక్య పరిపాలన అనే ధర్మమొక్కటే పెద్దది. ఇది ధర్మాన్ని తెలిపిన మునుల మాట.

భావం : పుణ్యక్షేత్రాలన్నీ సందర్శించడంవల్ల వచ్చిన పుణ్యంగానీ, సర్వవేదాధ్యయాన పుణ్యఫలంగానీ సత్యవాక్యంతో సరితూగలేవు. అన్ని ధర్మాలనూ ఎరిగినమునులు సత్యాన్ని మించిన ధర్మంలేదని, అన్ని ధర్మాలలోనూ సత్యమార్గము సరియైనదనీ, సత్యవచనమే గొప్పదనీ చెప్పారు.

ఆరో పద్యం : ముఖ్య పదాలకు అర్థాలు

విమల ప్రతిభ	=	స్వచ్ఛమైన జ్ఞానం
సంభావిత	=	మంచిగా భావించిన

తాత్పర్యం : పై కారణములచేత సత్యం యొక్క గొప్పతనం ఆలోచించి కణ్వాశ్రమంలో ఆ సమయంలో నాయందు కల్గిన భావాన్ని గుర్తు తెచ్చుకుని కుమారుని కరుణతో చూడు.

భావం : నీవు బాగా ఆలోచిస్తే కణ్వాశ్రమంలో నన్ను చూసిన సమయంలో నీవు ఎటువంటి భావాన్ని పొందావో ఏంజరిగిందో నీకు గుర్తు రాగలదు. దయచేసి అది స్ఫురణకు తెచ్చుకొని కుమారునియందు కరుణాదృష్టిని ప్రసాదించుము.

పాఠగత ప్రశ్నలు - 2

ఈ కింది ప్రశ్నలకు నాలుగేసి సమాధానాలు ఉన్నాయి. వాటిలో సరైన సమాధానం సంకేతాన్ని ఎదురుగా ఉన్న కుండలిలో సూచించండి.

1. యాగములు చేసినందువలన వచ్చే ఫలం ( )

   అ. ధనము ఇ. సంపదలు ఉ. పుణ్యము ఋ. పాపము

2. వేయి అశ్వమేధ యాగముల కన్నా గొప్పది ( )

   అ. నరమేధం ఇ. సత్యము ఉ. అబద్ధం ఋ. నూరుక్రతువులు

3. తీర్థాభిగమనం అను పదానికి అర్థం ( )

   అ. పుణ్యక్షేత్రాలను సందర్శించటం ఇ. దేవుని గుడిలో తీర్థం త్రాగటం

   ఉ. మంచి నీళ్లు ఋ. ఊళ్ళు తిరగటం

4. అన్ని ధర్మాలలో కెల్ల గొప్ప ధర్మం సత్యమని చెప్పిన వారు ( )

   అ. రాక్షసులు ఇ. పండితులు ఉ. రాజులు ఋ. ధర్మజ్ఞులైనమునులు

5. కణ్వాశ్రమంలో పెరిగిన వారు ( )

   (అ) దుష్యంతుడు (ఆ) శిష్యులు (ఉ) శకుంతల (ఋ) లతలు

6. దుష్యంతుడు శకుంతలను చూచినది ( )

   (అ) అడవిలో (ఆ) కణ్వాశ్రమంలో (ఇ) రాచనగరిలో (ఈ) యౌవనంలో

7. దుష్యంతుడు శకుంతలను ఎలా వివాహమాడాడు. ( )

   (అ) రాక్షసవిధి (ఆ) మానవవిధి (ఇ) దైవవిధి (ఈ) గాంధర్వవిధి

8. దుష్యంతుడు దయ చూపించాల్సినది ( )

   (అ) కొడుకునందు (ఆ) శకుంతలయందు (ఇ) ప్రజలయందు (ఈ) కుమార్తెయందు

సమాధానాలు : 1 – ఉ, 2 – ఇ, 3 – అ, 4 – ఋ.
5 – ఉ; 6 – ఆ; 7 – ఈ; 8 – అ.

13.7 కీలక భావనలు

- నన్నయ తెలుగు కవిత్వానికి ఆద్యుడు.
- ప్రాచీన సంప్రదాయకవిత్వంలో ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం మొదలైన అనేక ప్రక్రియలున్నాయి.
- నన్నయ రచించిన భారతం ఇతిహాస ప్రక్రియకు చెందింది.
- పద్యం ఛందోబద్ధమైన రచన
- మానవుని వ్యక్తిత్వాన్ని 24 (మహా) తత్త్వాలు పరిశీలిస్తూ ఉంటాయి.
- మూడు పురుషార్థాలను, వంశం నిలబెట్టటం, కీర్తి ప్రతిష్టలు ఐహిక,ఆముష్మిక, సుఖసంతోషాలను సాధించడంలో భార్య సమున్నతస్థానంలో నిలుస్తుంది.
- నూతులు, భావులు త్రవ్వించటం,క్రతువులు చేయటం, కొడుకును కనడం ఇవన్నీ క్రమంగా ఒకదానికొకటి వందరెట్ల పుణ్యఫలాన్నిస్తాయి. కానీ వీటన్నిటినీ మించిన పుణ్యఫలాన్ని ఒకే ఒక సత్యవాక్యం ఇస్తుంది.
- వేయి అశ్వమేధయాగ ఫలితాన్ని, ఒక సత్యవాక్య ఫలితాన్ని ఒకే త్రాసులో ఇరువైపులా వేస్తే సత్యవాక్యం వైపే ముల్లు మొగ్గు చూపుతుంది.
- పుణ్యక్షేత్ర సందర్శనం కన్నా, సకల వేదాధ్యయనం కన్నా సత్యమే గొప్పది.
- కాబట్టి సత్యాన్ని పలకటం ఈ లోకంలో నున్న అన్ని ధర్మాల కన్నా గొప్పదిగా భావించాలి.

అభ్యాసాలు

13.8 పాఠగత వ్యాకరణాంశాలు

A. సంధులు :

1. యశః + నిధీ - యశోనిధీ - విసర్గసంధి
2. ధర్మ + అర్థ - ధర్మార్థ - సవర్ణదీర్ఘ సంధి
3. సాధనకు + ఉపకరణాలు - సాధనకుపకణాలు - ఉకారసంధి
4. ఎల్లన్ + పాయు - ఎల్లబ్రాయు - సరళాదేశ సంధి
5. సర్వతీర్థ + అభిగమనము - సర్వతీర్థాభిగమనము - సవర్ణదీర్ఘసంధి.
6. కణ్వ + ఆశ్రమం - కణ్వాశ్రమం - సవర్ణదీర్ఘసంధి
7. పెద్ద + అంద్రు - పెద్దయంద్రు - యడాగమసంధి

B. సమాసాలు

1. యశోనిధీ – కీర్తియే నిధిగా కలవాడు – బహువ్రీహి సమాసం
2. పురుషవృత్తము – పురుషుని యొక్క వృత్తము – షష్ఠీతత్పురుషసమాసం
3. పంచ భూతములు – ఐదు (సంఖ్యగలవి) –ఐనభూతములు – ద్విగువ సమాసం
4. చంద్రసూర్యులు – చంద్రుడునూ సూర్యుడునూ – ద్వంద్వ సమాసం
5. మహాపదార్థములు – గొప్పవైన పదార్థములు – విశేషణ పూర్వపద కర్మాధారయ సమాసం
6. ధర్మార్థకామము – ధర్మమును, అర్థమును, కామమును–బహుపద ద్వంద్వ సమాసం
7. గృహనీతి – గృహమునందలినీతి – సప్తమి తత్పురుష సమాసం
8. హృదయ సంతోషము – హృదయమందలి సంతోషము – సప్తమి తత్పురుష సమాసము
9. జలపూరితము – జలము చేత పూరితము – తృతీయా తత్పురుష సమాసము
10. ఒకబావి – ఒకటి (సంఖ్యగల) ఐన బావి. – ద్విగు సమాసము.
11. సత్క్రతువు – గొప్పదైన క్రతువు – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.
12. సూనృత వాక్యము – సత్యమైన వాక్యము – విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.
13. తీర్థాభిగమనము – పుణ్యక్షేత్రములను గూర్చి గమనము – తృతీయా తత్పురుష సమాసము
14. కణ్వాశ్రమము – కణ్వుని యొక్క ఆశ్రమము – షష్ఠీతత్పురుష సమాసం

13.9 పాఠాంత ప్రశ్నలు

A. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలకు మించని సమాధానాలు రాయండి.

1. మానవుని నడవడిన నిరంతరం పరిశీలించే పదార్థాలు (తత్త్వా) ఎన్ని? అవి ఏవి?
2. భారతీయ కుటుంబవ్యవస్థలో భార్య స్థానం గూర్చి కవి ఏవిధంగా వివరించాడు.
3. వేటి వేటి కన్నా సత్యవాక్యము గొప్పదని కవి ఏ విధంగా వివరించాడు.
4. త్రాసులో వేసినపుడు ఏవైపు ముల్లు చూపుతుందని దేనితో ఏవి సరితూగలేవని కవి అన్నాడు.
5. అన్ని ధర్మాల్లో ఏ ధర్మం గొప్పది? ఎందుకు?

B. కింది ప్రశ్నలకు ఇరవై యేసి వాక్యాలకు మించని సమాధానాలు రాయండి.

1. శకుంతలోపాఖ్యానం పాఠం ఆధారంగా సత్యం యొక్క గొప్పతనాన్ని వర్ణించుము.
2. సత్యం గొప్పతనాన్ని చెప్పడంలో చెప్పబడిన రెండు ఉదాహరణలు తెలపండి.
3. 'సత్య వాక్యం' అనే పేరు ఈ పాఠానికి ఏ విధంగాసమంజసమో నిరూపించండి.
4. మానవ ప్రవర్తన ఏ విధంగా పరిశీలించబడుతుందో వివరించండి.

C. **కింది పద్యం చదవండి. తర్వాత ఇచ్చిన ప్రశ్నలకు ఒక్కొక్క వాక్యంలో సమాధానం రాయండి.**

కం. క్షమ లేని తపసితపమును,
బ్రమత్తు సంపదము, ధర్మ బాహ్యప్రభురా
జ్యము భిన్నకుంభమున తో
యములట్టుల యధ్రువంబు లగు విని యెల్లన్

ఇక కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఏవి శాశ్వతం కావో చెప్పండి.

సమాధానం ....

2. తపసి తపస్సు ఎప్పుడు వృధా అవుతుంది?

సమాధానం ....

3. ప్రభురాజ్యం ఎలా ఉండకూడదా?

సమాధానం ....

4. భిన్నకుంభమున తోయములట్టుల – వేటితోపోల్చారు?

సమాధానం ....

D. సందర్భసహిత వాక్యాలు

(i) తక్కొన నేర్చునే తన్ను మ్రుచ్చిలన్

కవిపరిచయం : 11వ శతాబ్దికి చెందిన నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించారు. సత్యవాక్యం అనే ఈ పాఠభాగం మహాభారతంలోని ఆదిపర్వం, చతుర్థాశసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుండి గ్రహించబడింది.

సందర్భం : పై వాక్యం శకుంతల తనను భార్యగా నిరాకరించిన దుష్యంతమహారాజుతో సత్యం యొక్క గొప్పదనాన్ని వివరించే సందర్భంలోనిది.

భావం : మానవుడు చేసే పనులను మహాపదార్థాలు ఎల్లవేళలా కనిపెడుతుంటాయి. ఎవరూ చూడలేదని తనను తాను మోసగించుకోవడం సాధ్యమా? సాధ్యం కాదని భావం!

(ii) నొనరc జూడగనిన జనులకెందు

కవిపరిచయం : 11వ శతాబ్దికి చెందిన నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించారు. సత్య వాక్యం అనే ఈ పాఠ్య భాగం మహాభారతంలోని ఆదిపర్వం, చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

సందర్భం : పై వాక్యం శకుంతల దుష్యంతునితో గృహిణి యొక్క ప్రాధాన్యతను, భార్య గొప్పతనాన్ని గురించి చెప్పిన సందర్భం.

భావం : కుటుంబంలో స్త్రీ పాత్ర ప్రధానమైనది. దాంపత్య జీవనంలో భార్య స్థానం మరింత గొప్పది. బాగా ఆలోచించి చూస్తే అన్ని ఆపదల నుండి, కష్టాల నుండి రక్షించేది. అన్ని సమయాలలో భర్తకు ఆనందాన్ని పంచగలిగేది భార్య మాత్రమే అని భావం.

(iii) దయకావింపుము గొడుకు జూడు కరుణాదృష్టిన్

కవిపరిచయం : 11వ శతాబ్దికి చెందిన నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించారు. సత్య వాక్యం అనే ఈ పాఠ్య భాగం మహాభారతంలోని ఆదిపర్వం, చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

సందర్భం : పై వాక్యం శకుంతల తనను భార్యగా అంగీకరించని దుష్యంత మహారాజుతో సత్యం యొక్క గొప్పదనాన్ని తెలిపే సందర్భంలోనిది.

భావం : కణ్వాశ్రమంలో నన్ను చూసి (శకుంతలను) నీవు పొందిన భావాన్ని దయతో గుర్తు తెచ్చుకొని కుమారుని కరుణా దృష్టితో చూడుము అని భావం.

(iv) సూనృత వాక్యము మేలు సూడగన్

కవిపరిచయం : 11వ శతాబ్దికి చెందిన నన్నయ ఆంధ్రమహాభారతాన్ని రచించారు. సత్య వాక్యం అనే ఈ పాఠ్య భాగం మహాభారతంలోని ఆదిపర్వం, చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

సందర్భం : పై వాక్యం శకుంతల దుష్యంతునితో దైవకార్యాలు, యజ్ఞాలు, సుపుత్రుల కంటే ఒక సత్యవాక్యం గొప్పది అని చెప్పిన సందర్భంలోనిది.

భావం : నూరు మంచినీటి బావులకంటే ఒక దైవకార్యం మేలు. దానికంటే నూరు క్రతువులు చేయడం మేలు. వాటి కంటే ఒక మంచి కుమారుని కనడం మేలు. వీటన్నింటికంటే ఒక సత్యవాక్యాన్ని మాట్లాడటం గొప్పది అని భావం.

13.10 సామాన్య వ్యాకరణాంశాలు

- **అలంకారాలు**

మొదటి పాఠంలోని మీరు రాతలో శైలి భేదాలను తెలుసుకున్నారు. ఆ శైలి భేదాల్లో ఒకటి పదసులభశైలి లేదా హృద్యశైలి. దీనినే అలంకారిక శైలి అంటారు. స్త్రీలకు నగలు ఎలా అందాన్నిస్తాయో సాహిత్యానికి అలంకారాలు అభరణాలౌతాయి. వీటిని ఉపయోగించి చేసిన రాతశైలిని అలంకార శైలి అంటారు. ఈ అలంకారాలను గురించి తెలుసుకుందాం.

అలంకారాలంటే ఆభరణాలు. మనం ఆభరణాలు ధరిస్తే మరింత అందంగా కనిపిస్తాం. ఈ అందం మనకెంతో ఆనందం కల్గిస్తుంది. ఇట్లే కావ్యం (రచన) పాఠకులకు ఆనందం కల్గించాలంటే అది కూడా అందంగా ఉండాలి. ఈ అందం అలంకారాల వల్ల కల్గుతుంది. వాక్యానికి అందాన్నిచ్చే ఈ అలంకారాలను గూర్చి ఈ పాఠంలో చదువుకుందాం.

అలంకారాలు సాధారణంగా రెండు రకాలు. అవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు. వీటి గురించి తెలుసుకుందాం.

A. శబ్దాలంకారాలు : (పదాలు) శబ్దాల ఉపయోగం ద్వారా రచనకు అందాన్ని తెస్తే అది శబ్దాలంకారాలు గల రచన అవుతుంది. ఆ అలంకారాలను శబ్దాలంకారాలు అంటారు. వీటిలోని భేదాలను తెలుసుకుందాం.

- **వృత్త్యనుప్రాస**

ఒకే హల్లు పలుమార్లు తిరిగి తిరిగి ప్రయోగింపబడితే అది వృత్త్యను ప్రాసాలంకారం అవుతుంది. పునరావృత్తి అయ్యే హల్లులకు సంఖ్యానియమంగాని, స్థాన నియమంగాని లేదు.

ఉదా : 'అడిగెదనని కడువడిజను' అడిగిన తమ మనుడనుడువడని అడ యుడుగున్ – (పోతన భాగవతం)

ఈ పద్యపాదంలో డ–కారం చాలాసార్లు ప్రయోగింపబడింది. అందుచేత ఇది వృత్త్యనుప్రాసాలంకారం. (వ్యంజనాలు తిరిగి తిరిగి ప్రయోగింపబడటం అనుప్రాస. కావ్యప్రయోగంలోని అనుప్రాసను వృత్త్యనుప్రాస అంటారు.)

- **అంత్యానుప్రాస**

అనుప్రాస పాదాంతంలో ఉంటే అది అంత్యానుప్రాస అవుతుంది.

ఉదా : 'అనుదిన సంతో**షణములు**
జనిత శ్రమతాపదుఃఖ సంశో**షణముల్**' (పోతన భాగవతం)

ఇక్కడ 'షణములు' అనే వ్యంజనాలు పాదాంతంలో తిరిగి వచ్చాయి. కావున ఇది అంత్యానుప్రాసాలంకారం.

- **లాటానుప్రాస**

ఒకే పదం తాత్పర్య (భావ) భేదంతో తిరిగి ప్రయోగింపబడితే అది లాటానుప్రాస.

ఉదా : 'కమలాక్షునర్చించు **కరములు కరములు**' (పోతన భాగవతం)

ఇక్కడ 'కరములు' అనే పదం రెండుసార్లు ప్రయోగింపబడింది. రెండింటికీ అర్థంలో భేదంలేదు. కాని తాత్పర్యంలో భేదం ఉంది. కమలాక్షు నర్చించే కరములే (చేతులే) కరములు(చేతులు) అని భావం. రెండవ కరములు అనే పదానికి విశిష్టమైన కరములు (చేతులు) అని అర్థం తీసుకోవాలి. కావున ఇది లాటానుప్రాసాలంకారం.

- **ఛేకానుప్రాస**

రెండు హల్లులు అర్థభేదంతో వెంట వెంటనే తిరిగి ప్రయోగింపబడ్డాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసాలంకారం.

ఉదా : సుందర దరహాసములు

ఈ పదబంధంలో రెండు హల్లులు (దర దర) అర్థబేధంతో వెంటవెంటనే ఉపయోగించబడ్డాయి. కాబట్టి ఇది ఛేకాను ప్రాసాలంకారం. దీనిలో మొదటి పదంలోని దార 'సుం'తో కల్సి అందం అనే అర్థాన్ని, రెండోపదం లోని 'దరహాసములు అనే పదంతో కల్సి చరి అనేర్థాన్ని (చిరునవ్వు) ఇస్తుంది.

- **ముక్త పద గ్రస్తము**

ముక్త పద గ్రస్తమంటే విడిచి పెట్టిన పదాన్ని తిరిగి గ్రహించడం. ఒకసారి ప్రయోగించిన పదాన్ని వెంటనే తిరిగి ప్రయోగిస్తే అది ముక్తపదగ్రస్తాలంకారం అవుతుంది.

ఉదా : 'సుదతీ నూతన **మదనా**

మదనాగ తురంగ పూర్ణ మణిమయసదనా'

ఇక్కడ 'మదనా' అనే పదం మొదటి పాదం చివర విడిచిపెట్టబడి మళ్ళీ వెంటనే రెండో పాదం మొదట గ్రహించబడింది.

అందువల్ల ఈ అలంకారం ముక్త పదగ్రస్తాలంకారం.

- **యమకము**

అక్షర సముదాయంలోని స్వర వ్యంజనాలు రెండూ అర్థభేదంతో తిరిగి ప్రయోగింపబడితే అది యమకాలంకారం.

ఉదా : 'సైనిక **నికాయము కాయము** మరచి పోరాడుచున్నది'

ఇక్కడ 'కాయము' అనే పదాలు తిరిగి ప్రయోగింపబడ్డాయి. మొదటి కాయము 'నికాయము' అనే శబ్దంలోనిది. దీనికి 'సముదాయం' అని అర్థం. రెండవ కాయము అనే దానికి శరీరము అని అర్థం. సైనిక సముదాయము ఒళ్ళు మరచి పోరాడుచున్నది అని పై వాక్యానికి అర్థం.

గమనిక: అనుప్రాసాలంకారాలలో హల్లుల సామ్యం ఉంటే చాలు. అచ్చుల సామ్యం అక్కరలేదు. యమకంలో అచ్చులు, హల్లులు రెండింటి సామ్యం కావాలి. లాటానుప్రాసలో ఒకే పదం ఒకే అర్థంలో తాత్పర్యంలో ప్రయోగింపబడుతుంది. యమకంలో ఒకే అక్షరాలు భిన్న అర్థాలలో వస్తాయి.

B. అర్థాలంకారాలు

శబ్దాలంకారాలలో శబ్దానికి ప్రాధాన్యత లభిస్తుంది. అర్థాలంకారాలలో శబ్దానికి గాక శబ్దం యొక్క అర్థానికి ప్రాధాన్యత ఇచ్చి రచనచేస్తే ఆ రచనకు అర్థాలంకారాలున్న రచన అంటారు. ఇవి పలు విధాలు. వీటిలో కొన్నిటిని గురించి తెలుసుకుందాం.

- **ఉపమాలంకారం**

ఒక వస్తువును మరొక వస్తువుతో పోల్చి చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు.

ఉదా : 'ఓ కృష్ణా! నీ కీర్తి హంసి వలె ఆకాశగంగయందు మునుగుచున్నది'

ఈ వాక్యంలో కృష్ణుని కీర్తి హంసితో పోల్చబడింది. దేని గురించి వర్ణిస్తున్నామో, అది ఉపమేయం.దేనితో పోల్చి చెపుతున్నామో అది ఉపమానం. రెండింటిలోనూ ఉన్న సమాన గుణమే సమానధర్మం. ఈ సమాన ధర్మాన్ని సూచించే శబ్దం ఉపమావాచకం. పై వాక్యంలో 'హంసి' **ఉపమానం**, 'కృష్ణుని కీర్తి' **ఉపమేయం**. 'ఆకాశగంగలో మునగడం' రెండింటియందు గల **సమానధర్మం**. 'వలె' **ఉపమావాచకం**.

- **ఉత్ప్రేక్షాలంకారం**

ఉపమానంతో ఉన్న ధర్మ సంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా భావించడం / ఊహించడం ఉత్ప్రేక్షాలంకారం. ఉదా : 'చీకటిని చక్రవాకి యొక్క విరహాగ్ని నుండి పుట్టిన పొగ అని తలంచెను' ఇక్కడ చీకటి ఉపమేయం, పొగ ఉపమానం. నల్లగా ఉండడం, కంటికికనిపించకపోవడం అనేవి సమానధర్మాలు. చీకటిని మనోహరమైన భావం కలిగేటట్లుగా చక్రవాకి యొక్క విరహాగ్ని నుండి పుట్టిన పొగ అని ఊహింపబడింది. అందువల్ల ఇది ఉత్ప్రేక్షాలంకారం.

- **రూపకాలంకారం**

ఉపమానమునకు, ఉపమేయమునకు అభేదం చెపితే ఇది రూపకం. లేక ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపిస్తే అది రూపకాలంకారం. రూపకం అంటే ఆరోపించడం.

ఉదా : 1. 'క్షణములో పురమును దహించిన శివుడే ఇతడు'

2. ఈ ముఖ చంద్రుని చేతనే నేత్రానందము లభించుచుండగా ఇక చంద్రు డేల?

మొదటి ఉదాహరణలో ఉపమానమైన 'శివునికీ' ఉపమేయమైన 'ఇతనికీ' అభేదం చెప్పబడింది. రెండవ ఉదాహరణలో ఉపమానమైన 'చంద్రుడు' ఉపమేయమైన 'ముఖము' నందు ఆరోపించడం జరిగింది.

- **అతిశయోక్త్యలంకారం**

ఉపమేయాన్ని మరుగుపరిచి ఉపమానాన్ని అధికంచేసి వర్ణించి చెప్పడం అతిశయోక్త్యలంకారం.

ఉదా : 'ఆ పురమునందలి మేడలు ఆకాశమునంటుచున్నవి'

పై వాక్యంలో మేడలు ఎత్తుగా ఉన్నాయని చెప్పడం ఉపమేయం.

మేడలు అతిశయంగా ఆకాశాన్నంటుతున్నాయని చెప్పబడింది. కావున ఇది అతిశయోక్తి అలంకారం.

- **అర్థాంతరన్యాసాలంకారం**

ఒక సామాన్య విషయాన్ని విశేష విషయంచేతకాని, ఒక విశేష విషయాన్ని సామాన్య విషయంచేతకాని సమర్థించి చెప్పినట్లయితే అది అర్థాంతరన్యాసాలంకారం.

ఉదా : 'హనుమంతుడు సముద్రమును దాటెను. మహాత్ములకు దుష్కర మేమి కలదు?'

ఇక్కడ హనుమంతుడు సముద్రమును దాటుట అనేది విశేషము. ఇది మహాత్ములకు అసాధ్యమైనదేదీ లేదు అనే సామాన్యం చేత సమర్థింపబడింది. సామాన్య విశేషాలనే అర్థాంతరాలకు సమర్థనం ఉండడంచేత ఇది అర్థాంతరన్యాసాలంకారం.

- **స్వభావోక్తి**

ఈ కింది వాక్యాలను చూడండి.

1. తుమ్మచెట్టు పూలు చిన్నవిగా పసుపు పచ్చ రంగులో ఉంటాయి. అవి బంగారం రంగులో చిన్నారి పూగుత్తులు తగిలించినట్లుంటాయి.

2. ఆ తుమ్మ చెట్టుకు గిజిగాడు, అతడి భార్య కలిసి ఒక గూడు కట్టుకున్నాయి. ఆ గూడు కొమ్మకు వేలాడుతూ ఉంటుంది.

3. గాలికి ఆ గూడు కదులుతూ ఉంటుంది.

పై వాక్యాల్లో ఒక పక్షి గూడు కట్టుకొనే విధం సహజపద్ధతిలో వర్ణించబడింది. ఇలా కనులకు కన్పట్టిన విషయాన్నే ఉన్నది ఉన్నట్లుగా చెప్పడంలో ఆ వాక్యాలకు, ఆఖ్యానకు అందాన్ని సమకూర్చింది. ఇలా సహజంగా చేకూరిన ఈ అలంకారం స్వభావోక్తి అలంకారమని విలువబడుతుంది.

నిర్వచనం : జాతి, గుణం, క్రియ మున్నగువాటిని ఉన్నది ఉన్నట్లు మనోహరంగా వర్ణించి చేస్తే అది స్వభావోక్తి అలంకారమవుతుంది.

కింది వాక్యాల్లోని అలంకారాలేవో తెల్పండి.

1. అనగననగ రాగము ....
2. మానవులు, దానవులు ....
3. శాస్త్రదృష్టి, తాత్త్వికదృష్టి, సాత్త్వికదృష్టి, క్రూరదృష్టి....................
4. తెలుగు పులుగులు వెలుగు పులుగులు ....
5. తెలుగు ఊరులు తెలుగు వాడలు తెలుగు వారలు తెలుగు దారులు ....
6. స్త్రీలు శాస్త్రపరిశోధకులుగా, దేశనాయకులుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, కలెక్టర్లుగా, పోలీసు ఆఫీసర్లుగా, గుమాస్తాలుగా పనిచేస్తున్నారు. వారు కార్లు, విమానాలు నడుపుతున్నారు.

   ....
7. పడియున్న యోగికైవడి యూరకున్న ముని కుమారుని జగన్నాహణకాడు

   ....
8. ఏలయ్య దశరథ మేము శోకాగ్ని
   గాల మాతనయునెక్కడ దాచితీవు

   ....
9. అసితచ్ఛని బొల్చు మహాభుజంగమో అనన్

   ....
10. వీటిది యైన మానసిక మెది వివేకము గల్గనేర్చునే

   ....

11. మోహార్ణవభ్రాంతి

....

12. శ్మశానాల వంటి నిఘంటువులు

....

13. ఓ కృష్ణా నీకీర్తి రాజహంసవలె ఆకాశగంగలో ఓలలాడుచున్నది

....

14. క్షణములు పురములను భస్మీభూతను చేసిన సాక్షాత్తు ఈశ్వరుడా ఇతడే కదా!

....

15. గాంధీజీ హత్య వల్ల జనించిన భారత జాతి దుఃఖాన్ని చూడలేక పోయాడా అన్నట్లు సూర్యుడు అస్తమించాడు.

....

16. ఈ నగరమండలి మేడల అగ్రభాగాలు ఆకాశన్నంటుతున్నాయి.

....

17. రాజా! నీ మాటలో అమృతముండగా, అమాయకులు చంద్రునిలో వెతుకుతున్నారు.

....

18. లతా లలనలు రాజుపై కుసుమాక్షతలు చల్లినవి.

....

19. గాలితీవ్రంగా వీస్తోంది. ఆ గాలికి చెట్లు వంగిపోతున్నాయి. గాలితీవ్రత కొంత తగ్గింది. జోరున వాన కురియడం ప్రారంభమైంది. కాలువలు పొంగాయి, వాగులు నిండాలి, నదులు పొర్లాయి.

....

20. నీచత, అధమత, కులహీనత

....

- **ఛందస్సు**

పద్య రచనకు సంబంధించిన శాస్త్రాన్ని ఛందశ్శాస్త్రం అంటారు. పద్యాలు తెలుగుజాతి వారసత్వపు సంపదలో ఒక భాగం. అందుచేత వాటిని మనం కంఠస్థం చేస్తూ ఉండాలి. ఈ సంప్రదాయాన్ని రాబోయే తరాలకు అందిస్తూ ఉండాలి. చదవడం వచ్చిన వాళ్ళంతా పద్యాలను పాడుకోవచ్చు. పద్యగానం మనకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఐతే పద్య నిర్మాణం గురించి చెప్పడం అంత తేలికైన పని కాదు. అందువల్ల పద్య నిర్మాణ శాస్త్రం (ఛందశాస్త్రం)లోని కొన్ని అంశాలను తెలుసుకుందాం.

పద్యంలో కొన్ని పాదాలుంటాయి. పాదంలో కొన్ని గణాలుంటాయి. గణంలో గురులఘువులుంటాయి. గురు లఘువు లంటే అక్షరాలే.

అ) గురులఘువులు : అక్షరాలు గురువులు, లఘువులు అని రెండు విధాలు. ఒక మాత్రా కాలంలో ఉచ్చరింపదగినవి లఘువులు. 'మాత్ర' అంటే హ్రస్వాక్షరాన్ని ఉచ్చరించడానికి పట్టే కాలం. రెండు మాత్రల కాలంలో ఉచ్చరింపదగినవి గురువులు. గురువుకు 'U' అని, 'I' లఘువు అని గుర్తులు.

హ్రస్వక్షరాలు లఘువులు	I	:	అ, క, కృ, మొ
దీర్ఘాక్షరాలు గురువులు	U	:	ఆ, కా, కౄ, మో,

ఇంకా కిందివి కూడా గురువులవుతాయి.

నిండు సున్నతో కూడినవి	:	అం, కం, ఆం, కాం
విసర్గతో కూడినవి	:	అః, కః
ద్విత్వాక్షరాలకు ముందున్నవి	:	అన్న, చెక్క. వీటిలో అ, చె, లు గురువులు న్న, క్కలు లఘువులు
సంయుక్తాక్షరాలకు ముందున్నవి	:	విద్య, పద్మము. వీటిలో వి, పలు గురువులు ద్య, ద్మ లు లఘువులు
హల్లుతో కూడినవి	:	అందున్, వనముల్. వీటిలో దన్, మల్ అనునవి గురువులు

గమనిక: ఏకపదంలో కాని, సిద్ధ సమాసంలోకాని ఉన్నప్పుడే. ద్విత్వాక్షరాలకు, సంయుక్తాక్షరాలకు ముందున్న హ్రస్వం గురువవడం జరుగుతుంది. లేకపోతే కాదు. ఉదా : సుక్షత్రియులు (ఏకపదం) ఈ పదంలో సు - గురువు. మంచి క్షత్రియులు (సిద్ధసమాసం కాదు). ఈ పదంలో చి - లఘువు. నిండుసున్నా మొదలైన వాటితో కూడిన అక్షరాలు, సహజంగా దీర్ఘస్వరాలతో ఉండవచ్చు. అప్పుడవి దీర్ఘస్వరాలనుబట్టే గురువులు. అరసున్నాకు ఛందస్సులో విలువలేదు.

ఆ) గణములు : 'గణం' అంటే సముదాయం. కొన్ని అక్షరాలు కలిసి గణం ఏర్పడుతుంది. వీటిలో పలు రకాలు ఉన్నాయి.

మూడక్షరాల గణాలు

శ్రీకృష్ణా	U U U	మగణం	-	గురువులు అన్నీ (మూడు)
వారలు	U I I	భగణం	-	ఆది గురువు
గభీర	I U I	జగణం	-	మధ్య గురువు
అధిపా	I I U	సగణం	-	అంత్య గురువు

కలవు	I I I	నగణం	-	లఘువులు అన్నీ
మహాత్మా	I U U	యగణం	-	ఆది లఘువు
కోరెడిన్	U I U	రగణం	-	మధ్య లఘువు
ధర్మంబు	U U I	తగణం	-	అంత్య లఘువు

2) రెండక్షరాల గణాలు :

UU – గగ (గా)   IU – లగ (వ)   UI – గల (హ)

II – లల (లా)   I– ల   U – గ (ఇది ఏకాక్షర గణం)

3) సూర్యగణాలు :

UI – గల (హగణం) (ఇది రెండక్షరాల గణం)

III – నగణం

4) ఇంద్రగణాలు :

UII –	భగణం		
UIU –	రగణం		
UUI –	తగణం		
IIIU –	నగం (నగణం (+) గురువు)	-	ఇది నాల్గక్షరాల గణం
IIII –	నలం (నగణం (+) లఘువు)	-	ఇది నాల్గక్షరాల గణం
IIUI –	సలం (సగణం (+) లఘువు)	-	ఇది నాల్గక్షరాల గణం

ఇ) **యతిప్రాసలు** : తెలుగు పద్యాలకు యతిప్రాసలు సహజమైనవి. పద్యపాదంలోని మొదటి అక్షరానికి 'యతి' అని పేరు. దీనినే వడి, వళి అని కూడా అంటారు. ఈ అక్షరాలకు పాదమధ్యంలోని ఒక అక్షరంతో కలిగి ఉండడాన్ని యతిమైత్రి అంటారు. పాదమధ్యంలో అక్షరానికి అనేది పద్యాన్నిబట్టి ఉంటుంది. పాదంలోని రెండవ అక్షరానికి ప్రాస అని పేరు. మొదటి పాదంలోని ప్రాసాక్షరం మిగిలిన పాదాల్లో కూడా రెండవ అక్షరంగా వస్తే దానిని ప్రాసమైత్రి అంటారు. (యతిప్రాసమైత్రులు ఎలా ఏర్పడుతాయో ఆ వివరాలు పై తరగతుల్లో నేర్చుకుంటారు). యతిలో స్వరవ్యంజనాలు రెంటికీ మైత్రి ఉంటుంది. ప్రాసలో వ్యంజన (హల్లు) మైత్రి ఒక్కటే ఉంటుంది. స్వరమైత్రి ఉండదు. పాదమధ్యంలో యతిస్థానం తరవాత ఉన్న అక్షరంతో ద్వితీయాక్షర ప్రాసమైత్రిని పాటిస్తే దానిని ప్రాస యతి అంటారు. ఇది సీసం, ఆటవెలది, తేటగీతి పద్యాలలో వస్తుంది. ఈ పద్యాలలో యతి మైత్రిగాని ప్రాసయతిగాని ఉంటుంది.

ఈ) పద్యాలు : ఇవి వృత్తాలు, జాతులు, ఉపజాతులు అని మూడు విధాలు. తెలుగులో ప్రసిద్ధమైన చంపకమాల, ఉత్పలమాల, శార్దూలం, మత్తేభం మొదలైనవి వృత్తాలు. కందము, ద్విపద మొదలైనవి జాతులు. ఆటవెలది, తేటగీతి, సీసము మొదలైనవి ఉపజాతులు.

ఇక గణాలతో ఏర్పడే పద్యాల గురించి తెలుసుకుందాం.

చంపకమాల : దీనికి ఉండే నాలుగు పాదాల్లోని ప్రతి పాదంలోను న-జ-భ-జ-జ-జ-ర అనే గణాలు వరుసగా ఉంటాయి. మొదటి అక్షరానికి, పదకొండవ అక్షరానికి యతిమైత్రి. దీని ప్రతిపాదంలో ఉంటుంది.

ప్రాసమైత్రి ఉంది.

III	UIU	UII	IUI	IUI	IUI	UIU
న	జ	భ	జ	జ	జ	ర
మదమ	డగించి	భూపతి	సమాజ	మునెల్ల	నునిన్ను	గొల్వజే

పై పద్యంలో మొదటి అక్షరానికి, పదకొండవ అక్షరానికి యతిమైత్రి చెల్లింది. దీనిలో ప్రాసాక్షరం - 'ద' వర్ణం

ఉత్పలమాల : దీనికి ప్రతి పాదంలోను భ-ర-న-భ-భ-ర-వ అనే గణాలు వరుసగా ఉంటాయి మొదటి అక్షరానికి, పదవ అక్షరానికి యతిమైత్రి. ప్రాసమైత్రి ఉంది.

UII	UIU	III	UII	UII	UIU	IU
భ	ర	న	భ	భ	ర	వ
వారయ	పథ్యమే	దియగు	నవ్విధ	మేర్పడ	నిశ్చయిం	పుమా

పై పద్యంలో మొదటి అక్షరానికి, పదవ అక్షరానికి యతిమైత్రి చెల్లింది. ఆ - అ. దీనిలో ప్రాసాక్షరం - ర వర్ణం.

శార్దూలం : దీనికి ప్రతిపాదంలోను మ-స-జ-స-త-త-గ అనే గణాలు వరసగా ఉంటాయి. మొదటి అక్షరానికి, పదమూడవ అక్షరానికి యతిమైత్రి. ప్రాసమైత్రి ఉంది.

UUU	IIU	IUI	IIU	UII	UII	U
మ	స	జ	స	త	త	గ
కారేరా	జులురా	జ్యముల్	గలుగవే	గర్వోన్న	తింబొంద	రే

మొదటి అక్షరానికి, పదమూడవ అక్షరానికి 'కా-గ' లకు యతిమైత్రి చెల్లింది. ప్రాసాక్షరం - ర వర్ణం.

మత్తేభము : దీనికి ప్రతి పాదంలోను స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా ఉంటాయి. మొదటి అక్షరానికి, పధ్నాల్గవ అక్షరానికి, యతిమైత్రి, ప్రాసమైత్రి ఉంది.

IIU	UII	UIU	III	UUU	IUU	IU
స	భ	ర	న	మ	య	వ
వ్రతముల్	దేవగు	రుద్విజ	న్మబుధ	సేవల్,దా	నధర్మా	దులున్

పై పద్యంలో మొదటి అక్షరానికి, 14వ అక్షరానికి వ్ర - వల్ లకు యతిమైత్రి చెల్లింది. దీనిలో ప్రాసాక్షరం - త వర్ణం.

జాతులు

కందము : ఇది నాలుగు పాదాల పద్యం. 1వ, 3వ పాదాలకు, 2వ, 4వ పాదాలకు లక్షణం సమానంగా ఉంటుంది. మొదటి, రెండు పాదాలకు కలిపి చెప్పిన లక్షణం మిగిలిన రెండు పాదాలకు వర్తిస్తుంది. మొదటి పాదంలో మూడు గణాలు, రెండో పాదంలో ఐదు గణాలు ఉంటాయి. ఈ పద్యంలో గగ(గా), భ,జ,స, నల అనే గణాలలో ఏమైనా వస్తాయి. బేసి గణాలలో అంటే 1, 3, 5, 7 గణాలలో జగణం ఉండకూడదు. ఆరవగణం జగణం కాని, నలంకాని అయి ఉండాలి. ఎనిమిదవ గణం చివర గురువు ఉండాలి. రెండవ పాదంలో మొదటి అక్షరానికి, నాల్గవ గణం మొదటి అక్షరానికి యతిమైత్రి ఉంటుంది. దీనిలో ప్రాసమైత్రి ఉంది.

భ	జ	భ
UII	IUI	UII
వచ్చెద	విదర్భ	భూమికి

UII	UII	IIII	IIII	UU
భ	భ	నల	నల	గగ
జొచ్చెద	భీష్మకు	ని పురము	సురుచిర	లీలన్

పై పద్యంలోని మొదటి పాదంలో భ–జ–భ అనే గణాలు, రెండవ పాదంలో భ–భ–నల–నల–గగ అనే గణాలు ఉన్నాయి. బేసి గణాలలో జగణం లేదు. ఆరవ గణం నలం. రెండవ పాదం చివర గురువు ఉంది. రెండవ పాదంలో మొదటి అక్షరానికి (జొ), నాల్గవ గణం మొదటి అక్షరానికి (సు) యతిమైత్రి చెల్లింది. ప్రాసమైత్రి చెల్లిన అక్షరం ద్విత్వ చకారం.

ద్విపద : ఇది రెండు పాదాల పద్యం. ప్రతిపాదంలోను 3 ఇంద్రగణాలు, తరువాత – ఒక సూర్యగణం ఉంటాయి. పాదంలోని మొదటి అక్షరానికి మూడవ గణం మొదటి అక్షరానికి యతిమైత్రి. ప్రాసమైత్రి ఉంది. దీనికి ఉదాహరణగా, పద్య లక్షణాన్ని చెప్పే ఈ కింది ద్విపద చూడండి.

భ	నగ	నగ	న
UII	I I I U	IIUI	I I I
ఇంద్రగ	ణములు మూ	డినగణం	బొకటి
త	నల	సల	గల
UUI	IIII	I IUI	UI
చంద్రాస్య!	ద్విపదకు	జనుజెప్ప	రేచ!

మొదటి పాదంలో భ–నగ–నగ (3 ఇంద్రగణాలు) న గణం (1 సూర్యగణం), రెండవ పాదంలో త–నల–సల (3 ఇంద్రగణాలు), గల (1 సూర్యగణం) ఉన్నాయి. (ఇనగణం – సూర్యగణం) యతిమైత్రి మొదటిపాదంలో

'ఇ–డి (మూడు + ఇన)' లకు, రెండవ పాదంలో 'చ–జ' లకు చెల్లింది. ప్రాసమైత్రి చెల్లిన అక్షరం – ంద్ర. (మూడు ఇంద్రగణాలు ఒక సూర్యగణం కలిసి ద్విపదకు ఒక పాదం అవుతుందని పై పద్యంలో లక్షణం చెప్పబడింది).

గమనిక: మంజరీ ద్విపద : ఇది ప్రాసమైత్రిలేని ద్విపద. అంటే ద్విపద లక్షణాలన్నీ ఉండి ఒక్క ప్రాసమైత్రి లేకపోతే దానికి మంజరీ ద్విపద అని పేరు. దీనికి శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర ప్రసిద్ధమైన ఉదాహరణ.

ఆటవెలది

ఇది నాలుగు పాదాలు గల పద్యం. బేసి (1,3) అంటే ఒకటో, మూడో పాదాలలో 3 సూర్యగణాలు, తరువాత 2 ఇంద్రగణాలు ఉంటాయి. రెండవ, నాల్గవ (2,4) పాదాలలో 5 సూర్యగణాలు ఉంటాయి. ప్రతిపాదంలోను 4వ గణం మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసమైత్రి లేదు. యతిమైత్రినిగాని ప్రాసయతినిగాని పాటించవచ్చు. దీనికి ఉదాహరణగా ఇచ్చిన కింది పద్యంలో ఈ పద్యలక్షణాలు కూడా ఉన్నాయి చూడండి.

న	గల	గల	త	భ
III	UI	UI	UUI	UII
ఇనగ	ణత్ర	యంబు	నింద్రద్వ	యంబును

గల	గల	గల	గల	గల
UI	UI	UI	UI	UI
హంస	పంచ	కంబు	నాట	వెలది

పై పద్యంలో మొదటి పాదంలో 3 సూర్యగణాలుగా న,గల,గల అనే గణాలు, 2 ఇంద్రగణాలుగా త, భ గణాలు ఉన్నాయి. రెండవ పాదంలో 5 సూర్యగణాలుగా అయిదు 'గల' గణాలున్నాయి. యతిమైత్రి మొదటిపాదంలో ఇ–ని (ను ఇ) లకు రెండవపాదంలో హ–నా(ను ఆ) లకు చెల్లింది.

(హంస పంచకము అయిదు సూర్యగణాలు)

తేటగీతి

ఇది నాలుగు పాదాల పద్యం. ప్రతి పాదానికి 1 సూర్యగణం, 2 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు వరసగా ఉంటాయి. ప్రతి పాదంలోను నాల్గవ గణాద్యక్షరం యతిస్థానం. ప్రాస నియమం లేదు. యతిమైత్రిగాని, ప్రాసయతిగాని పాటించవచ్చు. కింది పద్య పాదం దీనికి ఉదాహరణ. దానిలోనే పద్యలక్షణాన్ని కూడా మనం చూడవచ్చు.

న	త	భ	గల	న
III	UUI	UII	UI	III
ఇనుని	పై నిద్ద	రింద్రులు	నిద్ద	రినులు

పైపద్యంలో మొదటి సూర్యగణంగా నగణం, తరువాత రెండు ఇంద్రగణాలుగా త, భ గణాలు, తరువాత రెండు సూర్యగణాలుగా గల, న గణాలు ఉన్నాయి. ఇ – ని (ను ఇ) లకు యతిమైత్రి చెల్లింది.

సీసము

దీనిలో నాలుగు పెద్ద పాదాలుంటాయి. ప్రతి పాదానికి 6 ఇంద్రగణాలు, 2 సూర్యగణాలు వరసగా ఉంటాయి. ఈ పాదాన్ని రెండు చిన్న పాదాలుగా విభజిస్తే చిన్న పాదంలో 4 గణాలుంటాయి. ప్రతి చిన్నపాదంలోను మొదటి అక్షరానికి 3వ గణం మొదటి అక్షరానికి యతిమైత్రి అంటే పెద్ద పాదంలో 1,3,5,7వ గణాల మొదటి అక్షరాలు యతిస్థానాలు. నాలుగు స్థానాలలోను ఒకే యతిమైత్రినిగాని, 1,3 స్థానాలకు, 5,7, స్థానాలకు విడివిడిగా యతిమైత్రిగాని పాటించవచ్చు. ప్రాస నియమంలేదు. యతికి బదులు ప్రాసయతి కూర్చవచ్చు. ఈ విధంగా నాలుగు పాదాలు ఉన్న తరువాత, తోడుగా ఆటవెలది గాని తేటగీతిగాని ఉంటుంది. ఈ మొత్తం పద్యాన్ని సీస పద్యం అంటారు. తోడుగా ఉన్న గీతపద్యాన్ని ఎత్తుగీతి అని అంటాం.

సల	భ	నగ	సల
IIUI	UII	IIIU	IIUI
ఎదురైన	చోదన	మద కరీం	ద్రము డిగ్గి
త	నగ	గల	న
UUI	IIIU	UI	III
కేలూత	యొసగి యె	క్కించు	కొనియె

ఆరు ఇంద్రగణాలుగా సల, భ, నగ, సల, త నగ అనే గణాలున్నాయి. తరువాత రెండు సూర్యగణాలుగా గల, న అనే గణాలున్నాయి. 1, 3 గణాలకు ఎదు – మద అని ప్రాసయతి చెల్లింది. 5, 7 గణాల మొదటి అక్షరాలు కే – క్కి లకు యతిమైత్రి చెల్లింది.

13.11 అభ్యాసకులు చేయవలసినది

1. సత్యం కోసం నిలబడిన గొప్పవారి చరిత్రలను సేకరించండి.
2. మన కథల్లో 'సత్యం' ప్రాధాన్యతను చెప్పే కథలు ఎన్నో ఉన్నాయి. వాటిలో మీకిష్టమైన ఒక కథను మీ మాటల్లో రాయండి.
3 సత్యపు గోవు (ఆవు – పులి) కథను గేయరూపంలో గాని, కథ రూపంలోని గాని రాయండి.